క్లుప్తంగా

ఉప ఖజానా కార్యాలయ భవనానికి శంకుస్థాపన



పెదకూరపాడు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఉప ఖజానా కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం శంకుస్థాపన చేశారు. రూ.1.08కోట్లతో నిధులతో పనులు చేపడుతున్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరంగా ఉందన్నారు. వచ్చే మార్చి నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉప ఖజానా కార్యాలయ సిబ్బంది, టీడీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కష్టాలను బంధించారు..స్పందించారు



అచ్చంపేట: విజయవాడ వరద బాధితులకు అచ్చంపేట, పిడుగురాళ్ల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం నిత్యావసరం సరుకులు పంపిణీ చేశారు. అచ్చంపేట అసోసియేషన్ అధ్యక్షుడు బోరుగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ తమ అసోసియేషవన్ సభ్యులందరూ ఉడతా భక్తిగా సేకరించిన బియ్యం, నూనె, కందిపప్పు, చింతపండు వంటి సరుకులను తామే స్వయంగా వెళ్లి బాధిత కుటుంబాలకు పంపిణీ చేసి వచ్చామని చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి జ్యోతి ఆనంద్‌కుమార్, డీపీడబ్ల్యూఏ అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించండి



పెదకూరపాడు: రాజధాని ప్రాంతమైన పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్ హల్ట్ కల్పించాలని నియోజకవర్గ వామపక్ష నాయకులు శనివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలిసి వినత పత్రం అందించారు. హైదరాబాద్ నుంచి రాజధాని ప్రాంతానికి ప్రయాణం చేసేందుకు పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్ ఆగితే సులభతర మవుతుందన్నారు. నాయకులు మునగోటి శ్రీనివాసరావు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ చంద్రజ్యోతి శ్రీ, రైతు సంఘం నాయకులు దర్శి శేషారావు పాల్గొన్నారు.

చింత లేకుండా కూర్చోవచ్చు



అచ్చంపేట: వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పులిచింతల ప్రాజెక్టు సందర్శకుల కోసం స్నేహ హస్తాలు, పరి ఫౌండేషన్లు సంయుక్తంగా శనివారం రూ.40 వేలు విలువ చేసే 10 బెంచీలను విరాళంగా ఇచ్చారు. స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ సందర్శకుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలు, ఒక రేకుల షెడ్‌ను నిర్మించమని అచ్చంపేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట ప్రసాద్ కోరినట్లు తెలిపారు. తమ సంస్థ సభ్యులు బెంచీలను సమకూర్చారని, మరో నెలలో రేకుల షెడ్డు కూడా నిర్మించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఐ ప్రసాదు వారిని అభినందించారు.

శ్రేష్టమైన విద్య యోగ

నరసరావుపేట ఈస్ట్: యోగ విద్య శ్రేష్ఠమైనదని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు ఏ.వెంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 177వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన ఆనందోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులకు వేంకటేశ్వర గురూజీ ఆడియో సందేశం అందించారు. శారీరకంగా మానసికంగా ఎదురయ్యే సమస్యలను యోగా ద్వారా తేలికగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. భౌతిక, మనస్సు, ఆత్మ మూడింటినీ చక్కబెట్టుకుంటేనే జీవితం పరిపూర్ణమవుతుందని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరైన అభ్యాసకులకు ప్రాంతీయశాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ జ్ఞాపికలను అందచేశారు.

విమోచన ప్రార్థన మందిరంలో చోరీ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో విమోచన ప్రార్థన మందిరంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గడి పగలకొట్టి చోరీకు పాల్పడినట్లు విమోచన ప్రార్థన మందిరం మతబోధకులు సీహెచ్.యేజేస్కేలు తెలిపారు. కానుకల హుండీ, యాంప్లిఫైలర్ చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూరకు దూరమవుతున్న కాయలు



పట్టణంలోని రాజీవ్ గాంధీ మార్కెట్‌లోని కూర గాయలు

- ఏ కూరగాయ అయినా కిలో రూ.50 పైమాటే
- అధిక ధరలతో పేద, మధ్య తరగతిలో ఆందోళన

సత్తెనపల్లి: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఎడతెరిపిలేని వానకు పంటలు దెబ్బ తినడంతో రైతులు తీవ్రంగా నష్టపోగా .. ధరలు వినియోగదారులకు భారంగా మారాయి. ఉల్లికి తోడు కూరగాయల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాలపై అదనపు భారం పడుతోంది. వర్షాల కారణంగా టమాటా, మిర్చి, దొండ, వంగ, బీర, కాకర, దోస తదితర కూరగాయలతో పాటు ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కొన్ని రకాలను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎక్కువగా వినియోగించే కూరగాయలు పరిసర ప్రాంతాల నుంచి సత్తెనపల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌కు తక్కువ మొత్తంలో వస్తున్నాయి. దీంతో గత 20 రోజులతో పోలిస్తే సత్తెనపల్లి రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌లో ధరలు కేజీకి రూ. 10 నుంచి రూ. 20 వరకు పెరిగాయి. దొండ, వంగ, బీర, క్యారెట్ ధరలు రూ.60కి చేరాయి. బహిరంగ మార్కెట్లో కేజీకి మరో రూ.5 ఎక్కువగా ఉంటున్నాయి. గతంలో రూ. 5 ఉన్న తోటకూర, పాల కూర, చుక్క కూర కట్ట ధర ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. కొత్తిమీర ఏకంగా రూ.60 కు చేరుకోగా పుదీనా రూ.20 పలుకుతోంది.



క్యాలీఫ్లవర్

కొద్ది మొత్తంలోనే వస్తున్నాయ్..

సత్తెనపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌కు కొద్ది మొత్తంలోనే కూరగాయలు వస్తున్నాయి. దిగుబడులు తగ్గటంతో పాటు ధరలు పెరగడంతో నగర ప్రాంతాలకు కూరగాయలు తరలిపోవడంతో ధరలు పెరిగాయి. బీర, బంగాళాదుంప, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, బీట్‌రూట్, బీన్స్, కీరాదోస వంటివి బెంగళూరు నుంచి గుంటూరు మార్కెట్‌కు రాగా అక్కడ నుంచి తెప్పించుకోవాల్సి వస్తుంది. టమాట పలమనేరు నుంచి వస్తుంది. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి సగానికి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా రావడం లేదు. వర్షాలు తగ్గుముఖం పడితే తప్ప ధరలు తగ్గే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే మరింత పెరుగుతాయంటున్నారు.దీంతో పేదలకు పచ్చడి మెతుకులే గత్యంతరంలా మారి ఆందోళన చెందుతున్నారు.

కూరగాయల ధరలు ఇలా...

కూరగాయలు	కిలో ధర(రూ.ల్లో)
దొండ	60
వంకాయలు	60
బీర	60
క్యారెట్	60
చిక్కుడు	80
క్యాలీ ఫ్లవర్	70
కాకర	55
బంగాళ దుంపలు	46
టమాటా	40
మిర్చి	40
క్యాబేజీ	35
బెండ	50
గోరు చిక్కుళ్లు	50
దోస	30
కొత్తిమీర(కట్ట)	80
పుదీనా(కట్ట)	20

గణపతి బప్పా మోరియా..!



10వ వార్డులో పూజలందుకున్న వినాయకుడు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సత్తెనపల్లి: నియోజకవర్గంలో గణపతి నవరాత్రులు భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని వివిధ వార్డులు, గ్రామాల్లోని వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని 10వ వార్డు, వడ్డవల్లి బొడ్డురాయి సెంటర్, చెక్కవంతెన వద్ద, ధూళిపాళ్లతో పాటు పలు వినాయక మండపాలలో అన్న సంతర్పణలు చేపట్టారు. 10వ వార్డులో కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు, బొడ్డురాయి సెంటర్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు వడ్డెంపూడి పవన్, యెల్లినేడి లక్ష్మీ తులసీ తదితరులు పూజల్లో పాల్గొని, అన్న సంతర్పణలు చేపట్టారు. పలు వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగించి, ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా వినాయక మండపాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెదకూరపాడు: మండల కేంద్రంలోని మిట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. లింగంగుంట్ల, అబ్బురాజుపాలెం గ్రామాల్లోనూ పూజలు నిర్వహించారు. బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, గల్లా బాబురావు, ప్రసాద్ ఉన్నారు.



బొడ్డురాయి సెంటర్లో వినాయకుడికి పూజలు చేస్తున్న రామస్వామి



వడ్డవల్లి నుంచి నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

రూ.25,116 పలికిన లడ్డూ ప్రసాదం



సత్తెనపల్లి: పట్టణంలోని 24వ వార్డు సాలిపేటలో ఎన్నిమిది రోజులు పూజలు అందుకున్న గణనాయకుడి మండపంలో శనివారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు 10 కిలోల వినాయకుడి లడ్డూను రూ.25,116లకు కైవసం చేసుకున్నారు. వినాయక మండపం కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు ఉన్నారు.

17 లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే ప్రక్రియను ఈ నెల 17లోపు నూరుశాతం పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో శనివారం సమావేశం నిర్వహించారు. మొత్తం 44 పోలింగ్ కేంద్రాలకు గాను 35,813 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 98.44 శాతం సర్వే పూర్తయిందని, మిగిలినది కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులు స్వీకరించవచ్చన్నారు. జాబితాలో పేరు తప్పులు సరి చేసుకునే వీలుంటుందని అవగాహన కల్పించి, పూర్తి స్థాయిలో సర్వే పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఆర్ఐలు కపిల్‌దేవ్, పవన్‌కుమార్, ఆంజనేయులు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డేపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట వినాయక మండపం వద్ద ఈ నెల 11న అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో కరాటి వెంకటేష్, రాచమంటి పవన్ కళ్యాణ్ పై హత్యాయత్నం కేసులో ఏడుగురు నిందితుల్లో ఆరుగురు శుక్రవారం అరెస్ట్ అయ్యారు. పరారీలో ఉన్న మేదరపల్లి ప్రవీణ్‌ను శనివారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, సిబ్బంది పరారీలో ఉన్న ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నేడు ఉచిత బైక్ మెకానిక్ శిబిరాలు

సత్తెనపల్లి: విజయవాడ వరదల్లో నీట మునిగిన ద్విచక్ర వాహనాలకు ఆదివారం ఉచితంగా మరమ్మతులు చేయనున్నట్లు నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సుభాని తెలిపారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం ఆయన మాట్లాడారు. విజయవాడలోని సింగ్ నగర్, చర్చి సెంటర్, భవానిపురం, హౌసింగ్ బోర్డు, సితార తదితర సెంటర్లలో రెండు చొప్పున మొత్తం 10 ఉచిత బైక్ మెకానిక్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు సర్వీసు అందిస్తామని చెప్పారు. మరమ్మతులకు గురైనా బైక్‌లు మెకానిక్ శిబిరాల వద్దకు తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలకు 90309 81999, 92473 33535, 99899 73218 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఈ నంబర్లకు మిస్డ్ కాల్ ఇచ్చినా మెకానిక్ సిబ్బంది స్పందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ బాధ్యులు సుభాని, జానీ, కరిముల్లా, ఖాజా, సాయి ఉన్నారు.

గోగులపాడులో గ్రామదేవతల జాతర ప్రారంభం



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గ్రామ దేవతల జాతరోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి, పావనాలకు శుక్రవారం రాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. గ్రామ దేవతలు అయిన పోలేరమ్మ, అద్దంకమ్మ, పోతురాజులకు జాతరోత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహణవల్ల గ్రామంలోని అన్ని జీవరాశులకు ఆరోగ్యం, గ్రామంలో పంట పాలి పెరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. జాతరలో భాగంగా శనివారం పోలేరమ్మ తల్లికి కుంకమ బండ్ల కార్యక్రమం నిర్వహించారు. జాతరలో గ్రామ దేవతలను ఆనందం కలిగించేందుకు గణాచార్యులు, పంబళ్లు, బైనీడీలు తమ తమ పురాతన వాయిద్యాలతో కథలు చెబుతూ సాంప్రదాయమైన వీరంగం ఆడారు. గ్రామస్తులు కూడా ఉత్సవాల్లో పాల్గొని నృత్యాలు చేస్తారు. ఆచారవంతులు తమ తమ కులదేవతల ఆచారాలకు అనుగుణంగా పురాతన సాంప్రదాయ ఆచార వాయిద్యాలకు తోడుగా ఆధునిక తీన్‌మార్ డప్పులు, డ్రమ్ము, సైడ్ డ్రమ్ము, కిలార్‌నట్ వాయిద్యాల మధ్య జాతరోత్సవం ఉల్లాసభరితంగా సాగుతుంది.

18 నుంచి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18,20,21 తేదిల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చిరుమామిళ్ళ పీఈటీ, ఫెడరేషన్ క్రీడాశ్రీ కేవీ నాగరాజు తెలిపారు. ఈ నెల 18న ఉదయం 9 గంటలకు సాతులూరు జెడ్పీ హైస్కూలులో ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. 20న చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జెడ్పీ హైస్కూలులో వాలీబాల్ పోటీలు, 21న అమీన్‌సాహెబ్‌పాలెం జెడ్పీ హైస్కూలులో యోగా, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. తమ పాఠశాలల క్రీడాకారులను ఆయా పాఠశాలల పీఈటీలు తర్ఫీదునిచ్చి పోటీలకు హాజరుపరచాలని కోరారు.

హిందీ భాషను అందరూ నేర్చుకోవాలి



చిలకలూరిపేట: జాతీయ భాష హిందీని అందరూ నేర్చుకోవాలని వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ దండా పవన్‌కుమార్ చెప్పారు. వికాస్ పాఠశాలలో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భాష హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా మాట్లాడవచ్చని పేర్కొన్నారు. దేశంలోని ప్రతిభాష గొప్పదని, అదే సమయంలో జాతీయ భాషపైన దృష్టి సారించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో చిక్కు ప్రశ్నలు, పద్యాలు, పాటలు, నృత్య ప్రదర్శించి నిర్వహించారు. హిందీ చేతి రాత పోటీలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు.

రాజీమార్గానికి వేదిక లోక్ అదాలత్

- సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నాగ వెంకట శ్రీనివాసరావు
- జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 259 కేసుల పరిష్కారం

సత్తెనపల్లి: కక్షిదారులు రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక జాతీయ లోక్ అదాలత్ అని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు అన్నారు. శనివారం సత్తెనపల్లి కోర్టుల్లో రెండు బెంచీలుగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగవెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగే అనర్థాలతో ఎంతో మంది ఆర్థిక నష్టంలో కూరుకుపోతున్నారన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారన్నారు. రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్‌తో పాటు ఇతర కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బెంచ్‌కి సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు, లోక్ అదాలత్ మెంబర్‌గా న్యాయవాది ఆకుల నాగార్జున వ్యవహరించారు. మరో బెంచ్‌కి సత్తెనపల్లి మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శని, లోక్ అదాలతో మెంబర్‌గా న్యాయవాది బి.అమరయ్య నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా 47 సివిల్, 109 క్రిమినల్ వెరశి 156 కేసులు పరిష్కరించారు. వీటితోపాటు పీఎల్‌సీ- 09, ఎస్టీసీ- 94 వెరశి 103 కేసులు పరిష్కరించారు. ఆయా కేసులు ద్వారా రూ.1,67,34,664 చేతులు మారాయి. ఆయా కార్యక్రమాల్లో న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి నాగవెంకట శ్రీనివాసరావు



లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న న్యాయమూర్తి ప్రియదర్శిని

సీతారాం ఏచూరి జీవితం ఆదర్శనీయం



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు

నకరికల్లు: విద్యార్థి దశ నుంచి సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శిగా అంచలంచెలుగా ఎదిగిన కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను స్థానిక భగత్ సింగ్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గొప్ప పార్లమెంటరీ మేధావిగా ఆయన పలు కీలకమైన అంశాల్లో వ్యవహరించిన తీరు కొత్త ఒరవడికి నాంది పలికిందన్నారు. దేశంలో సంకీర్ణ, కూటమి ప్రభుత్వాలు ఏర్పడడంలోను, దేశ ప్రజల సమస్యల గురించి పార్లమెంట్‌లో ప్రసగించడంలోనూ ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గాడిదమళ్ల పిచ్చారావు, ఎంసీపీఐయూ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గాదె కుమారి, ఈవూరి అప్పిరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, గుంజా ఏడుకొండలు, చట్టు కోటేశ్వరరావు, గోవిందు నాయక్, రామాంజినేయులు, కొండా నాయక్, గోదా వెంకటరమణ, బండి అంజనేయులు పాల్గొన్నారు.

చలనం లేదని..చందాలేసుకుని



ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక వీరభద్రస్వామి కాలనీలో నీళ్లు నిలిచాయి. సందర్శనకు వచ్చిన కలెక్టర్ అరుణ్‌బాబు నీళ్లు బయటకు పంపే విధంగా అధికారులను ఆదేశించారు. ఇది జరిగి వారమైంది. కానీ, పంచాయతీ అధికారుల దగ్గర నిధులు లేకనో.. ఇక ఏ ఇతర కారణాల వల్లనో సైడ్ కాల్వలో ఎనిమిది అడుగుల సిమెంట్ పైపు ఒకటి వేశారు. తాత్కాలికంగా నీళ్లను మళ్లించి మమ అనిపించారు. పైపు అయితే వేశారు గాని కాలనీ వాసుల వాహనాలు వెళ్లేందుకు రోడ్డులో అవకాశం లేకుండా పోయింది. ఎవరూ స్పందించకపోవడంతో స్థానికులు ఇంటికో రూ.500లు చందాలేసుకుని సిమెంట్, ఇనుప చువ్వలు తెచ్చుకున్నారు. శ్రమదానంతో 10 అడుగుల వెడల్పుతో కల్వర్టు నిర్మించుకున్నారు. ఇందుకు తమకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చు అయిందని ప్రజలు వరదలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను ఆదుకోవడం అంటే ఇదేనా అంటూ పెదవి విరుస్తున్నారు. **–అచ్చంపేట**

సరస్వతి శిశు మందిర్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అచార్యులు

అమరావతి: గుంటూరు జిల్లా విభాగ్ స్థాయిలో సరస్వతి శిశు మందిర్‌లో పనిచేసే ఫౌండేషన్ ఉపాధ్యాయులకు స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో శనివారం నుంచి రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. గుంటూరు విభాగ్ ప్రముఖ్ ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. నేటి శిశువులే రేపటి దేశానికి అమూల్యమైన సంపదన్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిరాల్లో విద్యార్థి సమగ్ర వికాసం, శీలం, సంస్కార నిర్మాణమే లక్ష్యంగా విద్యా విధానం కొనసాగించాల్సి బాధ్యత ఆచార్యులపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరావు, ప్రధానాచార్యులు శివ పార్వతి, పాఠశాల అధ్యక్షులు పులిపాటి వెంకట పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబరు 115ను తక్షణమే రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు

సత్తెనపల్లి: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంతో పని చేస్తున్న తమకు గొడ్డలి పెట్టుగా మారిన 115 జీవోను తక్షణమే రద్దు చేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏరియా వైద్యశాల ఎదుట జీవోను రద్దు చేయాలని కోరుతూ శనివారం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్స రాలుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను కాదని ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పిస్తూ విడుదల చేసిన జీవోను రద్దు చేయాలన్నారు. 115 జీవో వల్ల తాము భవిష్యత్తులో రెగ్యులర్ అయ్యే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోతే ఆందోళన ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారి నిరసనకు రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపరిండెంట్ రాధ, హెడ్ నర్స్ బంగారు పాప, నర్సింగ్ సిబ్బంది మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సులు తదితరులు ఉన్నారు.

మట్టి ఖర్చులు అందజేత

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత గ్రామ నౌకరు కొత్తపల్లి వెంకమ్మ(68) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. గ్రామ నౌకరుగా ఎన్నో ఏళ్లు ఆమె పని చేసింది. వీఆర్వోలు వెంకమ్మ మృత దేహానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ మేళం భాస్కరరావు, జనసేన నాయకుడు శెట్టి సింగరయ్య కుటుంబ సభులను పరామర్శించి, మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు.